క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గణపతి హోమం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలోని ధర్మ శాస్తా దేవాలయంలో బుధవారం గణపతి హోమం నిర్వహించారు. అయ్యప్పస్వామికి పంచామృతాలతో అభిషేకాలు, సహస్ర నామార్చనలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఎల్.నందికేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఎంపీడీఓ ధనుంజయరావు

రణస్థలం: మండలంలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు బుధవారం ఎంపీడీఓ వి.ధనుంజయరావు ఇంటర్వ్యూలు నిర్వహించారు. జె.ఆర్.పురం, సీహెచ్ రాజాం గ్రామ సచివాలయ పరిధిలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేశారు. అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని ఆదేశించారు.

ముగిసిన అసిరితల్లి పండగలు



కొయ్యాం రోడ్డులో రద్దీ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలో ఈ నెల 20 నుంచి ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన అసిరితల్లి అమ్మవారి గ్రామ దేవత పండగలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజు విందు భోజనాలు ఏర్పాటుతో గ్రామంలోని రోడ్లు కిక్కిరిశాయి. ఎచ్చెర్ల నుంచి కొయ్యాం వైపు వెళ్లే రోడ్డుపై ప్రయాణికుల రద్దీ కనిపించింది. గ్రామమంతా బంధుమిత్రులతో కళకళలాడింది.

కంటి వైద్యుని మృతికి సంతాపం



డాక్టర్ ఆంజనేయులు (ఫైల్)

శ్రీకాకుళం: గత 28 ఏళ్లుగా కంటి వైద్యులుగా విశేషమైన సేవలు అందించిన డాక్టర్ పి.ఆంజనేయులు బుధవారం శ్రీకాకుళం పట్టణంలోని తన నివాసంలో మృతి చెందారు. ఈయన స్వస్థలం ప్రకాశం జిల్లా మాధవరం. ప్రభుత్వ డాక్టర్‌గా పనిచేస్తూ ఉద్యోగ రీత్యా శ్రీకాకుళంలో స్థిరపడ్డారు. జిల్లా కేంద్ర ఆస్పత్రిలో మెడికల్ సూపరింటెండెంట్, డీసీహెచ్ఎస్ పనిచేసి 1997లో ఉద్యోగ విరమణ చేశారు. తర్వాత కూడా కంటి వైద్యులుగా శ్రీకాకుళం కంటి ఆస్పత్రి నెలకొల్పి ఎంతో మంది పేదలకు వైద్యసేవలు అందించారు. ఆంజనేయులు మృతి పట్ల పలువురు డాక్టర్లు, వ్యాపారులు, ప్రముఖులు సంతాపం తెలియజేశారు.

రెండు పూటలా పనిచేస్తే వేతనం గిట్టుబాటు



ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఏపీడీ లోకేష్

జి.సిగడాం: రెండు పూటలా నిర్దేశిత కొలతల ప్రకారం పనిచేస్తే వేతనం గిట్టుబాటు అవుతుందని ఉపాధి ఏపీడీ కె.లోకేష్ అన్నారు. జి.సిగడాంలోని బారికివాని చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వేతనదారుడికి కనీసం రూ.272 వచ్చేలా పనులు చేయించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీఓలు చోళ్ల సత్యనారాయణ, పైల శ్రీనివాసరావు, ఈసీలు గేదెల పురుషోత్తంనాయుడు, సందీప్, క్వాలిటీ కంట్రోల్ అధికారి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే ఉజ్వల భవిష్యత్

శ్రీకాకుళం రూరల్: విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఐఆర్ఎస్ అధికారి, పూర్వ విద్యార్థి ఆర్‌పి ప్రవీణ్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని నైరా వ్యవసాయ వ్యవసాయ కళాశాలలో బుధవారం 34వ హాస్టల్ వారోత్సవాల్లో ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఇదే కళాశాలలో అగ్రికల్చర్ కోర్సు చదివానని, అనంతరం ఐఆర్ఎస్ అధికారిగా ఎంపికయ్యానని చెప్పారు. కార్యక్రమంలో బయో ఇన్ఫర్మేషన్ అధికారి జి.మోహన్‌రెడ్డి, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం కల్చరల్: బ్యాంకర్స్‌కాలనీలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణోత్సవం



శ్రీకాకుళం కల్చరల్: ఉమారుద్రకోటేశ్వరస్వామి కల్యాణం



శ్రీకాకుళం కల్చరల్: కొన్నావీధిలో భీమేశ్వరుని కల్యాణం



జి.సిగడాం: అభయాంజనేయ ఆలయంలో సీతారాముల కల్యాణం



శ్రీకాకుళం కల్చరల్: ఉమాదేవి సమేత అమరనాథ్వేశ్వరుడు

కల్యాణం.. కమనీయం



శ్రీకాకుళం కల్చరల్: చిన్నబజారులోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవం

- ఆలయాల్లో వైభవంగా కల్యాణోత్సవాలు
- తరలివచ్చిన భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: జేష్ఠశుద్ధ ఏకాదశి పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని చిన్నబజారులో వేంకటేశ్వరస్వామి(దూదివారి) ఆలయంలో స్వామివారి కల్యాణం బుధవారం నయనానందకరంగా జరిగింది. పాంచరాత్రాగమన ప్రకారం అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటెశ్వరస్వామి స్వామికి అర్చకులు రేజేటి వేంకట శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో భక్తుల సమక్షంలో కల్యాణం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిపించారు. కార్యక్రమంలో ఈఓ సర్వేశ్వరరావు, గీతా సత్సంగం సభ్యులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం కల్చరల్: గుడివీధిలోని ఉమారుద్ర కోటేశ్వరస్వామి ఆలయంలో ఉమా రుద్రకోటేశ్వరుల కల్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి. అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలోఅర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చందశేఖరశర్మ, ధర్మకర్తల మండలి చైర్మన్ సుంకరి కృష్ణ, సభ్యులు, ఈఓ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కొన్నావీధిలోని భీమేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు గంట చిన్న రామమూర్తి ఆధ్వర్యంలో కల్యాణోత్సవాలు సంప్రదాయబద్ధంగా జరిగాయి. ముందుగా స్వామివారి ఉత్సవ మూర్తులను ఊరేగించారు. బలగ ఉత్తరేశ్వర స్వామి ఆలయంలోస్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు.

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని దీపామహల్ వెనుకనున్న బ్యాంకర్స్ కాలనీలోని శివబాలాజీ ఆలయ 14వ వార్షికోత్సవంలో భాగంగా కల్యాణ వేంకటేశ్వర స్వామి, అమరనాథేశ్వరస్వామి వార్షిక తిరుక్కల్యాణ మహోత్సవాలు నేత్రపర్వంగా జరిగాయి. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకూర్మం అర్చకులు చామర్తి వేంకట సీతారామాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు డాక్టర్ జి.తులసీరావు, మహేష్ చంద్ర సామంత్, ఆర్‌వీఎస్.శర్మ, సభ్యులు ఎం.రామకృష్ణ, బి.వి.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జి.సిగడాం: మండల కేంద్రం జి.సిగడాంలో అభయాంజనేయ స్వామి అలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గార: మండలంలోని బూరవెల్లి లక్ష్మీనరసింహ స్వామి కల్యాణ మహోత్సవం ఏకాదశి పర్వదినాన అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ప్రధానార్చకులు ఆరవెల్లి సీతారామస్వామి, సత్యనారాయణ స్వామి, రాజేష్‌బాబుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి కోలాటం, మేళ తాళాలతో గరుడ వాహనంపై స్వామి ఉత్సవమూర్తులను ఊరేగించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



గార: బూరవెల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద..

ఘనంగా షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం

జి.సిగడాం: మండలంలోని పెంట గ్రామంలో షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. పూజ్య గురువులు అమ్ముల సాంబశివరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



బాబా చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ దంపతులు



వైభవంగా కోదండ సీతారామాలయ ప్రతిష్టాపనోత్సవం

రణస్థలం: పాతర్లపల్లిలో కోదండ సీతారామ ఆలయ విగ్రహ యంత్ర శిఖర ప్రతిష్టాపన మహోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, పరిమళ దంపతుల సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ శిలాఫలకం ఆవిష్కరణ, కలశాల ప్రతిష్టాపన, హోమ పూజలతో ప్రత్యేకంగా పూజలు జరిపించారు. అనంతరం ఐదు వేల మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో రణస్థలం ఎంపీపీ పిన్నింటి రజిని, సర్పంచ్ గొర్లె రాధాకృష్ణ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, పంచాయతీ పెద్దలు మహంతయ్య, లోలుగు కృష్ణ, ముతామేస్త్రి, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి విగ్రహ ప్రతిష్టాపన

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో సత్యసాయి సేవా సమితి పెద్దమందిరంలో బాబా విగ్రహ ప్రతిష్టాపన బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ముందుగా తెన్నేటి విక్రమశర్మ, సునీల్ శర్మలు సంప్రదాయంగా ప్రతిష్టాపన పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం జరిగింది. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వై.లింగరాజు, వ్యాపారవేత్త అంధవరపు సంతోష్, అన్నపూర్ణ సేవ ట్రస్టు అధ్యక్షుడు జి.రమణబాబు, మందిర కన్వీనర్ కె.మురళీకృష్ణ, విగ్రహదాతలు గుడ్ల భానుమూర్తి, జిల్లా సేవాదళ్ కోఆర్డినేటర్ సూర రామచంద్రరావు, స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి బోయిన నరసింహమూర్తి, ఊణ్ణ కృష్ణారావు, సత్యసాయి మందిరాల కన్వీనర్లు కిల్లాన ఫల్గుణరావు, ఎ.ప్రసాద్, ఎన్.వేణు, జోనల్ కన్వీనర్ పి.నాగేశ్వరరావు, చంద్రమౌళి, గంగాధర్, దాసు, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.



సత్యసాయి విగ్రహం వద్ద సాయిభక్తులు

జాతీయస్థాయి స్కాలర్‌షిప్‌కు ముగ్గురు ఎంపిక



స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులతో గురువు శ్రీకాంత్

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళానికి చెందిన శివశ్రీ నృత్య కళానికేతన్ విద్యార్థులు జాతీయ స్థాయి స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారని గురువు, నాట్యప్రవీణ రఘుపాత్రుని శ్రీకాంత్ తెలిపారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్వహణలో సెంట్రల్ కల్చరల్ రిక్రూట్‌మెంట్ అండ్ ట్రైనింగ్ వారు జాతీయ స్థాయి స్కాలర్‌షిప్‌కు పలు విభాగాల్లో పోటీలు నిర్వహించారని చెప్పారు. ఉత్తరాంధ్ర నుంచి కూచిపూడి విభాగంలో ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. ఈ పోటీలలో బూర్ల శ్రీకళ, దేవరశెట్టి ప్రణవి, కొమ్ము మోహిత్ కుమార్‌లు జాతీయ స్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. సీసీఆర్టీ స్కాలర్ షిప్ కోసం కూచిపూడి విభాగంలో 1600 మంది కళాకారులు పోటీపడగా ఉత్తరాంధ్ర నుంచి వీరు ఎంపిక కావడం సంతోషకరమన్నారు. వీరికి ఏడాదికి రూ.9వేలు చొప్పున ఐదేళ్ల పాటు అందిస్తారని చెప్పారు.

బదిలీపై వెళ్తున్న డీఎస్పీకి సన్మానం



డీఎస్పీని సన్మానిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం వైస్ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న డీఎస్పీ జి.శ్రీనివాసరావు అడిషనల్ ఎస్పీ పదోన్నతిపై విశాఖపట్నం ట్రాఫిక్ ఏడీసీపీగా వెళ్తున్న సందర్భంగా బుధవారం తండేవలసలో గల పోలీసు శిక్షణ కేంద్రంలో ఆయనను ఎస్పీ జి.రాధిక సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 45 రోజుల పాటు పోలీసు సిబ్బందికి ఆక్టోపస్ శిక్షణ తరగతులు, మహిళా పోలీసులకు, పోలీసు సిబ్బందికి క్రైమ్ అనాలసిస్, ఈకాప్స్ తదితర అంశాలపై శ్రీనివాస్ శిక్షణ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో సెబ్ జేడీవీ నాగమణికంఠ, అదనపు ఎస్పీలు టీపీ విఠలేశ్వర్, జె తిప్పస్వామి, డీఎస్పీలు వై శృతి, ఎస్.బాలరాజు, డి.ప్రసాద్‌రావు, సీఐలు పాల్గొన్నారు.

పొగాకుతో ఆరోగ్యానికి నష్టం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం రూరల్ : పొగాకు ఆరోగ్యానికి హానికరమని నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ వంటి వ్యాధులు వస్తాయని శ్రీసాయి డెంటల్ కళాశాల రీసెర్చ్ సెంటర్ ప్రిన్సిపాల్ పి.కృష్ణప్రసాద్ అన్నారు. ప్రపంచ పొగాకు వినియోగ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం శ్రీకాకుళం డేఅండ్ నైట్ జంక్షన్ నుంచి ఏడురోడ్ల జంక్షన్ వరకూ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిగరెట్, ఖైనీ, గుట్కా వంటివి వినియోగించడం వల్ల లక్షలాది మంది క్యాన్సర్లతో బాధపడుతున్నారని వివరించారు. వాటికి దూరంగా ఉండాలన్నారు.

సమర్థంగా విధులు నిర్వహించాలి

జి.సిగడాం : గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది సమర్థంగా విధులు నిర్వహించాలని ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు సూచించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పల్లెల్లో అంటురోగాలు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో విద్యుత్ శాఖ ఏఈఈ కె.తిరుపతిరావు, సీహెచ్ఓ కుప్పిలి శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

10న బాలు జయంతి వేడుకలు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక బాపూజీ కళామందిర్‌లో ఈ నెల 10న సాయంత్రం 6గంటలకు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 77వ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ నిక్కు అప్పన్న ఒక ప్రకటనలో తెలిపారు. తాను రాసిన వ్యాసమంజరి పుస్తకావిష్కరణ రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమం కళాప్రవీణ బండారు చిట్టిబాబు సంగీత నేతృత్వంలో ఎస్పీ బాలు సంగీత విభావరి జరుగుతుందని తెలిపారు. అభిమానులంతా పాల్గొనాలని కోరారు.

ఆదిత్యనగర్ కాలనీలో విద్యుత్ అవస్థలు

అరసవల్లి: అరసవల్లిలో ఆదిత్యనగర్ కాలనీలో విద్యుత్ సమస్యలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు వెయ్యికి పైగా వినియోగదారుల కనెక్షన్లున్న ఈ కాలనీలో ఒకే ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో తరచూ అవస్థలు తప్పడం లేదు. ముఖ్యంగా రాత్రివేళల్లో 3, 4, 5, 6వ లైన్లలో లోవోల్టేజి సమస్యతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. కాలనీలో ఉన్న రామమందిరం వద్ద కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారమవుతుందని, ఈ దిశగా విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని శాంతినగర్ కాలనీలో సత్యసాయి నృత్య కళానికేతన్ ఆధ్వర్యంలో నెలరోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం బుధవారంతో ముగిసింది. 50 మంది విద్యార్థులకు శాస్త్రీయ, జానపద కోలాటంలో ప్రాథమిక అంశాల్లో శిక్షణ ఇచ్చినట్లు నిర్వాహకురాలు ఎస్.పి.కవిత తెలిపారు. వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు.

కొనసాగుతున్న నిరసన

ఎచ్చెర్ల క్యాంపస్: డి.మత్స్యలేశంలో వైశాఖి హేచరీ పరిశ్రమకు వ్యతిరేకంగా స్థానికుల నిరసన కొనసాగుతోంది. భూగర్భ జలాలు కలుషితమయ్యాయని, గ్రామంలో ఆర్వో ప్లాంట్లు పరిశ్రమ యాజమాన్యం ఏర్పాటు చేయాలని, అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించి, కాలుష్యం నుంచి విముక్తి కలిగించాలని నినాదాలు చేశారు. కళ్లకు గంతలు కట్టుకుని పరిశ్రమ ముందు బుధవారం నినాదాలు చేశారు.

సెలవులో డీఆర్‌ఓ రాజేశ్వరి

శ్రీకాకుళం పాతబస్టాండ్ : భర్త అనారోగ్యం నేపథ్యంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి నెల రోజులు సెలవు పెట్టారు. ఈమె స్థానంలో ఇన్‌చార్జి డీఆర్‌ఓగా కొవ్వాడ పవర్ ప్లాంట్ భూ సేకరణ విభాగం అధికారి ఎస్‌డీసీ పి.మురళీకృష్ణను నియమించారు. ఈ మేరకు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఉత్తర్వులు విడుదల చేశారు.

యువకుడు అరెస్టు

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం రూరల్, రెండో పట్టణ పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడిన యువకున్ని బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రెండో పట్టణ ఎస్ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు. పట్టణానికి చెందిన అలగ హరిబాబు బీటెక్ చదివాడు. చెడు వ్యసనాలకు బానిసై ఏడాది కాలంగా తాళాలు వేసిన ఇళ్లపై దొంగతనాలకు పాల్పడ్డాడని ఎస్ఐ పేర్కొన్నారు.

5న చిన్నికృష్ణ సంతాప సభ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా బార్ అసోసియేషన్ సీనియర్ మెంబర్, మృదుస్వభావి దివంగత కణితి చిన్ని కృష్ణ సంతాప సభ ఈ నెల 5న నిర్వహించనున్నట్టు జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా బార్ అసోసియేషన్ భవనంలో సంతాపసభ ఉంటుందని పేర్కొన్నారు.

ఆత్మకథలు చదివి స్ఫూర్తిపొందాలి

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు ప్రముఖుల ఆత్మకథలు (ఆటో బయోగ్రఫీ)లపై గ్రంథాలయ అధికారి ఎం.నీలమ్మ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రముఖుల జీవిత చరిత్ర నుంచి విద్యార్థులు స్ఫూర్తి పొందాలన్నారు.

లావేరు: యోగా చేయడం వల్ల ఏకాగ్రత చేకూరుతుందని మురపాక గ్రంథాలయాధికారి ఎం.శ్రీనివాసరావు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు యోగా, ధ్యానం, రాజయోగంపై అవగాహన కల్పించారు. ప్రతిరోజూ యోగా సాధన చేస్తే మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకుడు పి.షణ్ముఖరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: విద్యార్థులు స్పోకెన్ ఇంగ్లిషుపై అవగాహన కలిగి ఉండాలని బలగ గ్రంథాలయ శాఖ రీడర్ వై.లోకేష్ అన్నారు. బలగ గ్రంథాలయ కార్యాలయంలో బుధవారం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీషు, జనరల్ నాలెడ్జ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకురాలు కె.అనిత తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం: పుస్తక పఠనంతో విద్యార్థులకు సంపూర్ణ జ్ఞానం కలుగుతుందని రణస్థలం శాఖా గ్రంథాలయాధికారి పి.వరలక్ష్మి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులకు దినపత్రికలు, కథలు పుస్తకాల చదివించడం, చిత్రలేఖనం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గార: మండల కేంద్రంలోని గార శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు నీతి కథల పోటీలు నిర్వహించారు. 6, 7, 8 తరగతులకు చెందిన విద్యార్థులకు నీతి కథల ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గార: నీతికథలు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం